సృష్టిశక్తిగల దేవదేవుడే కదా జగన్మోహినియై ఈశ్వరు నంత వానిమనసున బులకలు లేపెను!

భావోపాసనకే, — నిక్కంపు కళోపాసనకే ఆదర్శానువాదము,— అనువాదమట్లు తోపని యనువాదము సాధ్యమని తెలుపుట నా యాశయము. శబ్దానువాదముతో పని చెల్లినదని తలచువారి గ్రంథములను తెఱచి బాధపడుట యవివేకము.

మాతృకలోని భావములను హృదయంగమ మొనరించుకొని, పలుమాఱు మననము జేసికొనిన ప్రతిభాశాలి ఈ గ్రంథకర్తయనుటకు ఇందు వలసినన్ని దృష్టాంతములున్నవి. ఠీగములుబోలు కొన్ని పదములను పరికించినను, లోని భావవిభూతి దెస మనసు పోగలదు. ఈ నుడువులను పరికించినపుడు మనసు నృత్యమొనరింపదా?

"నవ్యజపా సుమారుణిమ సంధ్యాకాంతిమైనంది"
"కనకాబ్జంబులనీను మానసతటాకంబందు నీరాను
చుఁ"
"ముంగురుల్వీడిన మందారప్రసూనంబులుఁ"
"వరవైఢూర్యసమాన నాళవికచ స్వర్ణాబ్జ సంఛ
న్నమై"
"తరుణీరత్నము స్వప్నమందయిన పొందంగోరుచుఁ
నన్ను నిద్దురఁగాంక్షించుచునుండు."

ఇట్టివచనములు గ్రంథమున జాలగలవు. గ్రంథకర్త యత్నము మిగుల ప్రశంసనీయమైనది.

# గంటలమ్మ

శ్రీ రాయసం వెంకటశివుడుగారు

సీతంపేటలో సేద్యమందు మిగుల నష్టపడి, కొంచెము పొలమును అమ్మివైచి, 'చెడి పట్టణముచేరుమ'న్నట్లు తెలఁగా యల్లమంద తన భార్యతో గుంటూరుపురము ప్రవేశించెను. విడిచిపోవుట ఆఁడుగూఁతున కెపుడును కష్టమె. కాని, స్వగ్రామమునఁ దనకు కానుపువెంట కానుపు పోవుటచేత, గుంటూరు పయనమునకు కోటమ్మయు సిద్ధమయ్యెను. ఆనగరమున వీరు నివసించునది తమ్మావారితోఁట. నెలకు మూఁడువానలు గురియుచుండు పూర్వకాలమం దెపుడో, అక్కడక్కడ తోఁటలువేసికొని, గుంటూరి వేడిమినుండి భాగ్యవంతులగు పౌరులు కొంత యుపశమనము గాంచుచుండిరఁట. కాని, యీ పిదపకాలమందు వెనుకటి నీటి వసతు లంతరించుటచేత, ఇపుడాపురమున నిలిచియున్నవి చెట్లులేనితోఁటల పెద్దపేళ్లు మాత్రమె ! *

## ౧

శక్తి వంచనలేక పాటుపడు యువకుఁడగుటచేత, అచిరకాలములోనె యల్లమంద పనివాఁడను పేరందెను. మొదటిరోజులలో కూలినాలిచేసికొని యెటులో యాతఁడు గాలి జీవనము చేయుచుండెను గాని, ఇటీవల కొంతడబ్బు చేరుటచేత, యల్లమంద

* నిజమయిన వృత్తాంతము.

మోఁతబండి యొకటికొని, రెయిలు బజారులమధ్య వర్తకపుసరకులు కొనిపోవుచు, మంచిలాభమునందుచున్నాఁడు. కొరిటేపాటి బండ్లజట్టు తరువాత తమ్మావారితోఁట జట్టె గుంటూరులో నెల్ల వాసికెక్కినది. మెలికలు తిరిగిన దండలు, నల్లని బుగ్గమీసములును చిహ్నములుగాఁగల మన యల్లమందయె ఆ జట్టునకు మేస్త్రి!

౨

కుటుంబపోషణమునకు మగఁడిన్ని పాట్లు పడుచుండుటఁ జూచి యూరకుండనొల్లక, కోటమ్మ తానొక పొగాకు ఫ్యాక్టరీలోఁ గూలికిఁగుదిరి, రోజుకు పావులా సంపాదించుచున్నది. చెప్ప మఱచిపోయితిమి. ఇటీవల వారికుటుంబము వృద్ధినొందినది. తన కడుపున మగబిడ్డపుట్టి దక్కినయెడల మస్తాను పేరు పెట్టుదునని కోటమ్మ యొక మస్తానుఉరుసు సమయమున మ్రొక్కుకొనెను. ఆ ప్రత్యక్ష దేవత ప్రసాదమువలన సంత నామెకుఁ గుమారుఁడుగలిగి పెరుఁగుచున్నాఁడు. పిమ్మట రెండేండ్లకొక యాఁడుపిల్లకలిగెను. ఆయేఁటివేసఁగిని మశూచకములచటఁ జెలరేగెను. తమ్మావారితోఁట దాపున నిటీవల పాటకపుజనుల గుడియొకటి వెలసినది. అది వేలకొలఁది రూప్యములు వెచ్చించి తీర్చి కట్టిన దేవాలయముకాదు. మంత్రోచ్చారణతో ప్రాణప్రతిష్ఠనందిన స్వామిగాదచట నుండునది. పండ్లుగడచిన వేపచెట్టు మొదట గాతిబండ నొకటినిలిపి ప్రజలు పసుపుకుంకుమలు పూయఁగా అది గంటలమ్మగా వెలసినది. ఆపద మ్రొక్కులు గైకొనిన యాదేవి యనుగ్రహమువలన కోటమ్మ కూఁతురంత మశూచకమునుండి తేలి, గంటలమ్మ యను పేరుదాల్చెను.

౩

యల్లమంద గుణము మంచిది. సహవాస దోషమున నెప్పుడైన వాఁడు సారాయి దుకాణము చూచివచ్చినను, సామాన్య కార్మికులవలె రాబడిలో చాలభాగము త్రాగుటకు వెచ్చించువాఁడుకాడు. పొదుపరియగు కోటమ్మ, మగఁడు తన చేతికిచ్చిన డబ్బులోఁ దాను సంపాదించిన సొమ్మును జేర్చి పెంచుచుండుటచేత, ఆ దంపతులు శీఘ్రకాలములోనె స్థితిమంతులను పేరు నొంది, తమ యిద్దఱు పిల్లలతోను సుఖజీవనముఁ జేయుచున్నారు.

౪

మాయదైవము వీరి మీఁదను, గుంటూరు సీమ వారియెడలను అలుకఁ బూనెనా యనునట్లు, ఈయేఁడు వేసవి కాలము ముగియకమునుపె విశూచి జాడ్యమచట ప్రారంభమై, కార్చిచ్చువలె వేవేగముగఁ బురమంతటను వ్యాపించెను! వ్యాధి తగులనీయదని వైద్యుఁడు చేతికెక్కించు సూదిమందెవెతలపాలు చేయుననియు, రోగము సోకినతోడనె ఆస్పత్రికిఁ జేర్పఁబడు దురదృష్టవంతులు పాట్లు దేవునికె యెఱుక యనియు, పామరజనులలో నపోహలు బయలుదేరెను! కావున తమ్మావారితోఁట లోని యేఁబదిపాకల వారికిని వారియిష్ట

దేవత గంటలమ్మయె యింకగతి! చూచుచుండఁగనె వ్యాధి పట్టణము నలముకొనుట చేత, ధైర్యమువీడి, ప్రజ లచటినుండి పలాయనమయిరి.

౫

'దూలమువచ్చి తలఁదాఁకినట్లు' ఈచిన్న కుటుంబములో నంతట విశూచియమ్మవారు ప్రవేశమయ్యెను! గృహిణికి వ్యాధి సోఁకెను. కోటమ్మ చనిపోవుటయె తడవుగా, అప్పుసొప్పులకై యాగక, బ్రదికియుండిన బలుసాకు తినవచ్చుననియు, ఇద్దఱుపిల్లలు దక్కిన చాలుననియును దలపోసి, యల్లమంద వారిని వెంటఁగైకొని, గుంటూరు విడిచిపెట్టెను. వారొక సెలయేటి దరికివచ్చుసరికి, మస్తానునకు రోగముతగిలి, వాని యసువులఁ గొనిగొనిపోయెను. గారాబముపఁబెంచిన తన కుమారుని కళేబరమా యిసుకతిప్పలోఁ బూడ్చివైచి, యల్లమంద స్వగ్రామము చేరెను. శని వాని నిచటను వెంటాడించెను. యల్లమంద తమవాఁడని మోమోటములేక, మీఁదు మిక్కిలి వీనితో రోగాంకురములు తమ యూరదిగుట స్పష్టమనియెంచి, గ్రామస్థులు వాని నచటినుండి తరిమివైచిరి. దిక్కులేనివానికి దైవమేదిక్కు! ఊరివెలుపల నున్న గుడియొద్ద కంత యల్లమంద తన చిన్నకూఁతురితోఁ జేరెను. ఇంతలో వానికిని రోగమారంభమై, ఒకజాములో యల్లమందయుఁ జనిపోయెను.

౬

అన్నను తలిదండ్రులనుబాసి యేకాకియై గుడిచెంత బ్రాఁకులాడుచున్న యామూఁడేండ్లశిశువు గంటలమ్మయొద్ద కెవరును జేరకున్నారు! పూజారులు కరుణించి, అన్నమొకింతకలిపి దూరమునుండియే యాపిల్లకుఁ బెట్టుచువచ్చిరి. దీనికిని వ్యాధి సోఁకునని యె వారిభయము కాని, యట్లు జరుగలేదు. ఆబాలిక ముందు సంగతిని గుర్తించి యా గ్రామవాసులంత నాలోచనలు సాగించిరి. దాని పర్యవసానము, ఆయూర సంతానములేని యొక భాగ్యవంతులయింట గంటలమ్మ యిపుడు పెరుఁగుచున్నది. తలిదండ్రుల పెంపున కాబాలిక యింక నోఁచుకొనకున్నను, దయార్ద్రహృదయులయిన యాగృహ యజమానుల నిర్హేతుకప్రేమయె దిక్కులేని యాపసిపాప కిపుడు శరణము!